క్లుప్తంగా

10 నుంచి తిరువడి సన్నిధి ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో కార్తీక మాసంలో చివరి ఆదివారమైన ఈనెల 10వ తేదీన తిరువడి సన్నిధి ఉత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు స్వామివారి ఆలయం ఎదురుగా ఉన్న ఆంజనేయస్వామివారి మూలవర్లకు తిరుమంజనం నిర్వహిస్తారు. మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఉభయ నాంచారులతో కలిసి శ్రీగోవిందరాజస్వామి వారి ఉత్సవమూర్తులను ఆంజనేయస్వామివారి సన్నిధికి వేంచేపు చేసి అక్కడ ఏకాంతంగా తిరుమంజనం చేపడతారు. అక్కడ ఆస్థానం చేసిన అనంతరం ఉభయనాంచారులతో కూడిన శ్రీగోవిందరాజస్వామివారు, శ్రీఆంజనేయస్వామివారి ఉత్సవమూర్తులను ఆలయ మాడవీధుల్లో ఊరేగింపుగా శ్రీగోవిందరాజస్వామి ఆలయానికి తీసుకెళ్తారు. దీంతో తిరువడి సన్నిధి ఉత్సవం పరిసమాప్తం కానుంది.

అమ్మవారి సేవలో సినీనటి సంగీత



తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారిని సినీనటి సంగీత గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం ఏర్పాట్లను చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వచన మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

హరిప్రియకు డాక్టరేట్



మనోహరన్ హరిప్రియ

తిరుపతి తుడా : స్విమ్స్ యూనివర్సిటీలో ఫిజియాలజీ విభాగపు వైద్యవిద్యార్థిని మనోహరన్ హరిప్రియకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వనజాక్షమ్మ తెలిపారు. ఆమె డాక్టర్ ఎన్ శర్వాణి పర్యవేక్షణలో ఎఫెక్ట్స్ ఆఫ్ ఆర్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్ ఆన్ ఆక్సిడేటివ్ స్ట్రెస్ మార్కర్స్ ఇన్ పేషెంట్స్ విత్ కరోనరీ ఆర్టరీ డిసీస్ అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.

యానాదుల సమస్యలపై పోరాటం

భాకరాపేట : యానాదుల సమస్యలపై నిరంతర పోరాటాలకు సిద్ధం కావాలని ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చందమామల కోటయ్య పిలుపునిచ్చారు. గురువారం చిన్నగొట్టిగల్లు మండలం చిట్టిచెర్ల యానాది కాలనీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు మారినా యానాదుల బతుకుల్లో మాత్రం మార్పు రాలేదన్నారు. యానాదులు అడవులను నమ్ముకుని జీవనం సాగిస్తున్నారన్నారు. భూమిలేని యానాదులకు భూమిపై హక్కు కల్పించాలన్నారు. సమావేశంలో ఆ సంఘం నేతలు సహదేవయ్య, శారద, తదితరులు పాల్గొన్నారు.

త్వరగా రిజిస్ట్రేషన్లు పూర్తి చేయండి

భాకరాపేట : ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలకు రిజిస్ట్రేషన్లను త్వరగా పూర్తి చేయాలని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం ఎంపీడీఓలు దేవేంద్రబాబు, అమర్‌నాథ్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ నవంబరు 27 నుంచి రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, డిసెంబరు 13వ తేదీకి పూర్తి అవుతాయన్నారు. గ్రామస్థాయి పోటీలు ఈ నెల 15 నుంచి మొదలై రాష్ట్రస్థాయిలో 24న ముగుస్తాయన్నారు. గ్రామ/వార్డు వలంటీర్లు త్వరగా క్రీడాకారుల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలని కోరారు.

డబుల్ వాటర్ ప్రూఫ్ టెంట్లు వితరణ



నిరుపేదలకు డబుల్ వాటర్ ప్రూఫ్ టెంట్లను అందజేస్తున్న దాత తహసున్నీషా

తిరుపతి కల్చరల్: ఓటేరులోని గంగిరెడ్డుల కాలనీలో నివాసం ఉంటున్న నిరుపేదలకు ఉయ్ సపోర్ట్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత తహసున్నీషా భేగం గురువారం డబుల్ వాటర్ ప్రూఫ్ టెంట్లను వితరణ చేశారు. గంగిరెడ్డుల కాలనీలో నిరుపేదలకు గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వారి పూరి గుడిసెల్లోకి నీరు చేరడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వారి ఇక్కట్లను గుర్తించిన తహసున్నీషా భేగం తన సొంత నిధులతో డబుల్ వాటర్ ప్రూఫ్ టెంట్లను 12 మందికి అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మౌల, సుజాత, స్థానిక నేతలు ఓటేరు కృష్ణ, రామకృష్ణ, పద్మనాభం పాల్గొన్నారు.

ఏ కష్టమొచ్చినా అండగా ఉంటాం





వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న పంచాయతీ నాయకులు, వరద బాధితులకు ఆర్థిక సాయం అందజేస్తున్న శివశంకర్‌రాజు, వీఆర్‌ఓ భూపతి, నాయకులు

- వరద బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందజేత
- ఎమ్మెల్యే, తుడా చైర్మన్‌కు రుణపడి ఉంటాం: వరద బాధితులు

తిరుపతి మంగళం : చంద్రగిరి నియోజకవర్గంలోని ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆ ఇంటి బిడ్డలుగా ఉండి ఆ కుటుంబాలను ఆదుకుంటామని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రజలకు భరోసా కల్పించారు. అన్నా మాకు కష్టం వచ్చిందంటే పరుగున వచ్చి ఆదుకుంటున్న గొప్ప నాయకులుగా తండ్రి కొడుకులు ప్రజల మన్ననలు పొందుతున్నారు. గత వారం రోజులుగా కురిసిన భారీ తుపాన్ కారణంగా మంగళం, తిరుమలనగర్ పంచాయతీ కేబీఆర్ నగర్ వాసులు వరదముంపులో చిక్కుకుని నానాఅవస్థలు పడ్డారు. విషయం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హుటాహుటిన వరదనీటిలోనే ఆ పంచాయతీ పార్టీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజుతో కలిసి కేబీఆర్‌నగర్‌కు వెళ్లి వరదముంపునకు గల కారణాలను పరిశీలించారు. అక్కడ ఉన్న వరద బాధితులను సురక్ష ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన వసతి ఏర్పాట్లు చేయాలని అధికారులకు, స్థానిక నాయకులు ఆదేశించారు. దీంతో తిరుమలనగర్ పంచాయతీలోని సచివాలయం వద్ద వరద బాధితులకు గుండ్రాజు శివశంకర్‌రాజు వసతి సదుపాయంతో పాటు దుప్పట్లను అందించారు. దాంతో పాటు అతిథులకు విందుభోజనం ఏర్పాటు చేసినట్లుగా వరద బాధితులకు గత మూడు రోజులుగా చికెన్, కోడిగుడ్లతో భోజనం ఏర్పాటు చేశారు. ×అన్నా మా ఇళ్లలో కూడా ఇలాంటి భోజనం తినేవాళ్లం కాదని• తమకు ఇన్ని వసతులు కల్పించిన ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని వరదబాధితులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

తక్షణ ఆర్థిక సాయం అందజేత..

తుపాను కారణంగా నష్టపోయిన వరద బాధితులకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తక్షణ ఆర్థిక సాయం అందించాలని అధికారులకు ఆదేశించిన విషయం తెలిసిందే. దాంతో వరద ముంపునకు నష్టపోయిన మంగళం తిరుమలనగర్ పంచాయతీ కేబీఆర్ నగర్ వరద బాధితులకు గురువారం ఆ పంచాయతీ పార్టీ ఇన్‌చార్జ్ గుండ్రాజు శివశంకర్‌రాజు, వీఆర్‌ఓ భూపతి, ఉపసర్పంచ్ తిరుమల ప్రసాద్, అధ్యక్షుడు రమేష్, ఎంపీటీసీ శ్రావణ్, శ్రీరాములు, మణి ఒక్కొక్కరికి రూ.2500 చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు.

మార్గదర్శకాల మేరకు నిధుల వెచ్చింపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాజ్జీ

పాకాల : రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం విడుదల చేసిన నిధులను ప్రభుత్వ మార్గదర్శకాల ఆధారంగా ఖర్చు చేయాలని ఎంఈఓ బాజ్జీ తెలిపారు. గురువారం స్థానిక ఎమ్మార్సీలో అన్ని ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతీ పాఠశాలకు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు వచ్చాయని, వాటిని పాఠశాలలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మరమ్మతుల కోసం వినియోగించాలన్నారు. ఏ విధంగా ఖర్చు చేయాలనే విషయమై ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసిందని, ఆ ప్రకారమే వెచ్చించాలన్నారు. వీటికి సంబంధించిన బిల్లులు, ఓచర్స్, అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అనంతరం వీటిని ఆఫీసుకి చేర్చాలన్నారు. ఎంఈఓ-2 లింగయ్య మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీలోపు పాఠశాలల్లో మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, సీఆర్పీలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపండి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ మొహిద్దీన్‌బాషా

పాకాల : ప్రస్తుత పరిస్థితుల్లో అధ్యాపకులతో పాటు విద్యార్థుల చదువులపై తల్లిదండ్రులు కూడా శ్రద్ధ చూపాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మొహిద్దీన్‌బాషా తెలిపారు. గురువారం కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ మొదటి, ద్వితీయ, తృతీయ సంవత్సరాల విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు కళాశాలలో చేపడుతున్న బోధన, పరీక్షల గురించి వివరించారు. విద్యార్థుల హాజరు, పరీక్షల్లో సాధించిన మార్కులు, క్రమశిక్షణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ సురేంద్ర, ఐక్యూఏసీ సమన్వయకర్త రమేష్‌కుమార్, అకడమిక్ సమన్వయకర్త ఈశ్వర్‌బాబు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అదృశ్యమైన విద్యార్థుల ఆచూకీ లభ్యం

- నిజామాబాద్‌లో విద్యార్థులను గుర్తించిన రైల్వే పోలీసులు
- తిరుమల పోలీసులకు సమాచారం
- ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు



నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో చిన్నారులు

తిరుమల : తిరుమల నుంచి అదృశ్యమైన ముగ్గురు విద్యార్థులను నిజామాబాద్ రైల్వేపోలీసులు పట్టుకుని తిరుమల టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. బుధవారం స్థానిక ఎస్వీ హైస్కూల్లో ఏడవ తరగతి చదువుతున్న ఎస్.చంద్రశేఖర్(13), వైభవ్ యోగేష్(13), జీ.శ్రీవర్ధన్(13)లు పాఠశాలలో మధ్యాహ్నం జరిగే పరీక్షకు హాజరుకాలేదు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు ఫిర్యాదు చేయడంతో వారు గాలించినా కనపడకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన తిరుమల టూటౌన్ ఎస్‌ఐ సాయినాథ్ చౌదరి దర్యాప్తులో భాగంగా తిరుమలలోని సీసీ కెమెరాల ద్వారా విద్యార్థులు తిరుపతి బస్టాండ్‌లో దిగినట్లు గుర్తించారు. అనంతరం అక్కడి నుంచి రైల్వేస్టేషన్ వైపు వెళ్లి రైల్లో ప్రయాణం చేసినట్లు తెలుసుకున్నారు. దీంతో పోలీసులు తమిళనాడు, హైదరాబాద్, బెంగళూరు వైపు వెళ్లే అన్ని రైళ్లకు సంబంధించి విద్యార్థులను ఫొటోలను ఆయా పోలీస్‌స్టేషన్లు, రైల్వే పోలీసులకు పంపారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని నిజామాబాద్ రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా ఒంటరిగా ఉన్న ముగ్గురు విద్యార్థులను గుర్తించిన రైల్వే పోలీసులు పట్టుకుని విచారించడంతో తిరుమల వాసులుగా గుర్తించారు. అనంతరం తిరుమల పోలీసులకు సమాచారాన్ని అందించారు. విద్యార్థులు తప్పిపోయిన 24 గంటల్లో గుర్తించడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులను తిరుమలకు తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించేందుకు తిరుమల టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ సాయినాథ్ ఆధ్వర్యంలో ప్రత్యేకబృందం నిజామాబాద్‌కు వెళ్లి విద్యార్థులను తీసుకువస్తున్నారు.

బంగారు ఆభరణం అప్పగింత



బంగారు బ్రేస్‌లెట్‌ను భక్తుడికి అప్పగిస్తున్న వీఐ రామ్మోహన్

తిరుచానూరు(చంద్రగిరి): అమ్మవారి దర్శనానికి వచ్చిన నవ వధూవరులు ఆలయంలో పోగొట్టుకున్న బంగారు బ్రేస్‌లెట్‌ను టీటీడీ విజిలెన్స్ అధికారులు తిరిగి అప్పగించిన ఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు.. తిరుచానూరుకు చెందిన మునికుమార్, లక్ష్మీప్రసన్న గురువారం వివాహం చేసుకుని, అమ్మవారి దర్శనానికి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి వెళ్లే సమయానికి పెళ్లికొడుకు చేతికి ఉన్న 20 గ్రాముల బంగారు బ్రేస్‌లెట్ కనిపించకపోవడంతో విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. సీసీ కెమెరా ద్వారా బ్రేస్‌లెట్‌ను గుర్తించిన అధికారులు వీఐ రామ్మోహన్‌కు తెలియజేశారు. అనంతరం తగిన ఆధారాలు చూపించడంతో బ్రేస్‌లెట్‌ను అప్పగించినట్లు ఆయన తెలిపారు. విజిలెన్స్ అధికారులు తక్షణమే స్పందించి, తన బ్రేస్‌లెట్‌ను అప్పగించడంతో టీటీడీ అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు ఓటు నమోదు, సవరణ కార్యక్రమం

తిరుపతి కల్చరల్: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల కోసం కొత్తవీధిలోని ఆర్యవైశ్య సంఘ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఓటరు నమోదు, తప్పుల సవరణ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులతో కలిసి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నామని పేర్కొన్నారు. ఓటు వేయడం ద్వారా మంచి నాయకున్ని ఎన్నుకోవడానికి ఓటు ఒకటే సరైన ఆయుధమన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ఓటు అని, 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఓటు నమోదుతో పాటు అచ్చుతప్పులు, వారిన చిరునామా వంటి వాటిని సరి చేసుకోవాలని కోరారు. తిరుపతితో పాటు చుట్టుపక్కల ఉన్న ఆర్యవైశ్యులంతా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

క్రీడాకారుడికి తుడా చైర్మన్ చేయూత



తైక్వాండో క్రీడాకారుడు మహేష్‌కు ఆర్థికసాయం అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తన దాతృత్వ సేవలను నిరంతరం కొనసాగిస్తూనే ఉన్నారు. జాతీయ స్థాయి తైక్వాండో క్రీడలో రాణిస్తున్న తిరుపతి రూరల్ పరిధిలోని లింగేశ్వర నగర్‌కు చెందిన మహేష్‌కు రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. గురువారం తుమ్మలగుంట నివాసంలో క్రీడాకారుడు మహేష్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. 2024 ఒలింపిక్స్‌లో విజేతగా నిలవాలని ఆకాంక్షించారు. తాను జాతీయస్థాయిలో 2022లో నేపాల్‌తో పోటీపడి విజేతగా నిలిచినట్లు మోహిత్‌రెడ్డికి తెలిపాడు. ప్రస్తుతం తాను ఢిల్లీలోని జాతీయ క్రీడా అకాడమీలో ఉంటూ 2024 ఒలింపిక్స్ పోటీలకు సిద్ధమవుతున్నట్లు చెప్పాడు. తన ఓ పెయింటర్ అని, ఆర్థిక ఇబ్బందులు ఉన్నట్లు చెప్పడంతో మోహిత్‌రెడ్డి నగదు సాయం అందించారు. ఈ సందర్భంగా తుడా చైర్మన్‌కు మహేష్ కృతజ్ఞతలు తెలిపాడు.

శ్రీవారి సేవలో పలువురు ప్రముఖులు





తిరుమలలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, సినీ నటుడు అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డి

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి దర్శించుకున్నారు. గురువారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో ఆయన స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అంతకుముందు తిరుమల శ్రీవారిని ప్రముఖ టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ భార్య కుటుంబ సభ్యులు స్నేహారెడ్డి దర్శించుకున్నారు. ఆలయం వెలుపల డిప్యూటీ సీఎం నారాయణస్వామి మీడియాతో మాట్లాడుతూ.. కులాలను ప్రోత్సహించే వ్యక్తులు మారాలని, కులవృత్తులు కాకుండా విద్యావంతులు, ఆర్థిక, రాజకీయ ఇబ్బందులు లేకుండా పేదవాడు కూడా ఉన్నత విద్య అభ్యసించేలా చేసిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిపై శ్రీవారి ఆశీస్సులు ఉండాలని వేడుకున్నట్లు చెప్పారు.

ప్రత్యేక ప్రతిభావంతులపై శ్రద్ధ వహించండి



మాట్లాడుతున్న ఎంఈఓ లలిత కుమారి

చంద్రగిరి: ప్రత్యేక ప్రతిభావంతులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంఈఓలు లలిత కుమారి, భాస్కర్ బాబు అన్నారు. గురువారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని స్థానిక భవిత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రతిభావంతులు సంప్రదాయ వస్త్రాధారణలో ఆకట్టుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా చంద్రగిరి భవిత పాఠశాలలో ప్రత్యేక ప్రతిభావంతుల కోసం అనేక సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఫిజియోథెరపీ, స్పీచ్ థెరపీతో పాటు వారికి ఇతర అంశాలపై కూడా శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతోందన్నారు. పాఠశాలతో పాటు ఇంటి వద్ద కూడా పిల్లలకు అర్థమయ్యే రీతిలో తల్లిదండ్రులు శిక్షణ ఇవ్వాలని, వారిపై ప్రత్యేక చొరవ చూపాలని సూచించారు. అనంతరం ప్రత్యేక ప్రతిభావంతులకు ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో బాలికల పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణా రెడ్డి, భీమా భాస్కర్ రెడ్డి, హెచ్‌ఎం సహిత, శ్యామలాదేవి, వెంకట రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సురక్షలో కార్డియాక్ వైద్య సేవలు



ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీ లలితను సత్కరిస్తున్న వైద్యులు

తిరుపతి తుడా: తిరుపతి నగరం కరకంబాడి రోడ్డు లోని సురక్ష ఆసుపత్రిలో గురువారం నుంచి గుండె సంబంధిత వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఆసుపత్రి అధినేత డాక్టర్ హేమకుమార్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు కార్డియాక్ విభాగాన్ని ఆయన ప్రముఖ గుండె వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీలలితతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ హేమకుమార్ రెడ్డి మాట్లాడుతూ గడిచిన 16 సంవత్సరాలుగా సురక్ష ఆసుపత్రి ద్వారా వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. నాణ్యమైన వైద్యాన్ని అందించాలన్న ఉద్దేశంతో అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తెచ్చామన్నారు. గుండె సంబంధిత వైద్య సేవలను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రుయా ఆసుపత్రి రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమణయ్య, వైష్ణవి ఆసుపత్రి అధినేత డాక్టర్ మునిశేఖర్, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇట్టా ఉంటే ఎట్టా వెళ్లేది సార్..!







రాయలసీమకే తలమానికమైన రుయా ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న పోస్టాఫీస్ కార్యాలయం వద్ద నెల రోజులుగా డ్రైనేజీ పొంగి పొర్లుతోంది. నిత్యం వైద్య సిబ్బంది, రోగులు, వారి సహాయకులు ప్రసూతి ఆస్పత్రికి ఈ పొంగిపొర్లుతున్న డ్రైనేజీ దాటుకుంటూ వెళ్లాలి. పోస్టాఫీసులోకి వెళ్లే ప్రజలు, వైద్య సిబ్బంది సైతం ఆ వాసనకు ముక్కుకు మాస్కులు, వస్త్రాలు అడ్డు పెట్టుకుని వెళ్తున్నారు. ఈ చిత్రాలను చూసైనా సంబంధిత అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోవాలని పలువురు ఉద్యోగులు రోగులు, వాహనదారులు కోరుకుంటున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి

చదువులమ్మ చెట్టు నీడలో..



తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడింది. దీంతో విద్యార్థులు పచ్చటి చెట్ల కింద కుర్చీలు, బల్లలపై కూర్చుని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఈ దృశ్యాలను సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. - సాక్షి ఫొటోగ్రాఫర్ తిరుపతి